క్లుప్తంగా

కుష్ఠురోగులకు ఆహారం, పండ్ల పంపిణీ



కుష్ఠురోగులకు ఆహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి

మహారాణిపేట : స్వాతంత్ర్య సమరయోధులు రూపాకుల సుబ్రహ్మణ్యం 102వ జయంతి సందర్భంగా ఏవీఎన్ కాలేజీ సమీపంలో ఉన్న ప్రేమ సమాజం కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ కేఎస్ ఎల్‌జీ శాస్త్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ శిష్టా శ్రీలక్ష్మి, రామ్‌కుమార్, చొక్కాకుల రాంబాబు, ఎస్.మహేష్, టి.గిరిజ, డాక్టర్ వై.లక్ష్మణరావు, గేదెల శ్రీహరి, ఒ.ఆల్బర్ట్, సాహూ లక్ష్మణరావు, రాము, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన



నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి మాట్లాడుతూ పట్టుదలతో సాధించలేనిది ఏమీ లేదన్నారు. జాబ్‌మేళాలో డబ్ల్యూఎన్ఎస్, ఎస్ఎన్ఎఫ్ ఫార్మా, ఫినో పేమెంట్ బ్యాంక్‌లు పాల్గొనగా, 119 మంది నిరుద్యోగులు హాజరుకాగా, 32 మంది ప్లేస్‌మెంట్ పొందారని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ కె. సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ డి అరుణపద్మ, జేకేసీ మెంటార్ వీఎన్ రాజు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం .రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ కె. ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సమితికి రూ. 50 వేల విరాళం



సీపీఐ జిల్లా సమితికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న కిరణ్మయి

అల్లిపురం : సీపీఐ జిల్లా సమితికి ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి భార్య జె. కిరణ్మయి తన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ నుంచి రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్‌లో 35 సంవత్సరాలు వివిధ హోదాల్లో పని చేసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ హోదాలో పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల కార్యదర్శులకు రూ.50 వేలు అందజేశారు. ఆమెను విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రావు, మూడు జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, పి.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో బి.వెంకటరావు, అచ్యుతరావు, డి.మార్కండేయులు, జి.కాసులరెడ్డి, ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అండా..దండా

పాలనలో నూతన ఒరవడి సృష్టించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడిన మాట తప్పని నేతగా పేదసాదల మన్ననలు అందుకుంటున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ ఆపకుండా అర్హులకు అందజేస్తూనే ఉన్నారు. ప్రతి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెంచుతూ అందరికీ అండాదండా అందజేస్తున్నారు. అభాగ్యుల కష్టం తెలుసుకుని ఆదుకుంటున్న ఇలాంటి ముఖ్యమంత్రి మరో 30 ఏళ్లు చల్లగా ఉండాలని.. తమ బాగోగులు చూడాలని పేదలంతా కోరుకుంటున్నారు.



29వ వార్డులో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

- పలు వార్డుల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కొత్త పింఛన్ల మంజూరు
- అర్హులకు నూతన పెన్షన్లు అందజేసిన వైఎస్సార్‌సీపీ నేతలు



పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

మహారాణిపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శవంతమని 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆయన ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని కొనియాడారు. శుక్రవారం వార్డులో 29 మంది అర్హులైన వృద్ధులు, వితంతువులకు ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున, అంగవైకల్యం గలవారికి రూ.3,000 చొప్పున కొత్త పెన్షన్లు మంజూరయ్యాయి. వీరందరికీ దండుబజార్ సచివాలయంలో కార్పొరేటర్ వురికిటి నారాయణరావు చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నారాయణరావు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలు చూడకుండా ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ పాటుపడుతున్నారని అన్నారు. ఇవే పథకాలను దేశంలో పలు రాష్ట్రాలు అవలంబిస్తున్నాయన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా నేరుగా ప్రజలకు మేలు జరిగే విధంగా సచివాలయాల వలంటీర్లు, సెక్రటరీలు పని చేస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. తమను ఆదుకుంటున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని పెన్షనర్లు, ఇతర లబ్ధిదారులు కృతజ్ఞతలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఇటువంటి ముఖ్యమంత్రి మరో 30 ఏళ్లు పదవిలో వుండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు ఆర్పీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

39వ వార్డులో..

జగదాంబ : పింఛన్ల మొత్తం పెంచి అవ్వాతాతల కళ్లల్లో ఆనందం నింపిన నాయకుడు జగనన్న అని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. శుక్రవారం 39వ వార్డులో కొత్తగా 39 పెన్షన్లు మంజూరు కాగా వాటిని సాధిక్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం మనదే అన్నారు. గత ప్రభుత్వం పింఛన్ ఇస్తామని చెప్పి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుందన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రతి నెల ఇంటికే పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టి పింఛనుదారుల కళ్లలో ఆనందం నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కల్లుపాకల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

జీవీఎంసీ 35వ వార్డులో శుక్రవారం 95 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సెక్రటరీలతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రతినెలా ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఉదయమే ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మొదటిరోజే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

మహానేత పేరిట సేవలు అభినందనీయం



పేదలకు కూరగాయలు అందజేస్తున్న శ్రీవత్సవ్, వివేకానంద స్వచ్ఛంద సంస్థ సభ్యులు



కువైట్‌లో ఉంటున్న రామకృష్ణ

దాబాగార్డెన్స్ : మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని కువైట్‌లో ఉపాధి పొందుతున్న వేగి రామకృష్ణ శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. పాతపోస్టాఫీస్ సమీపాన గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిపారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్ మాట్లాడుతూ నగరానికి చెందిన రామకృష్ణ కువైట్‌లో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రామకృష్ణ ఫోన్‌లో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పేదల ముఖాల్లో చిరునవ్వు కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. స్నేహితుల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులు, పేదలకు చీరలు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, సత్తిబాబు, సోంబాబు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించారు. వేంకటేశ్వరమెట్ట నివాసితులు 1450 సర్వే నంబర్ సమస్యపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ఆయన సీసీఎల్ అధికారులతో మాట్లాడి వివరాలను వేంకటేశ్వరమెట్ట వాసులకు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణరావు, తాతబ్బాయి, బొడ్డేటి కిషోర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

36వ వార్డులో.. : జామియా మసీదు, ఏవీఎన్ కాలేజీ దగ్గర జరిగిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కొత్తగా పెన్షన్ మంజూరు అయిన లబ్ధిదారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు, వార్డు ప్రెసిడెంట్లు అలపన కనకరెడ్డి, మాజీ కార్పొరేటర్ పులిరాజు, నాయకులు ముజీబ్‌ఖాన్, బొగ్గు శ్యామ్, ఆదివిష్ణు, బోణి దేవ, వద్దాది దిలీప్, బొడ్డేటి ప్రసాద్, వెంకటలక్ష్మి, ముస్లిం నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



36వ వార్డు జామియా మసీదు వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మహా అన్నదానం



దుర్గాలమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా దుర్గాలమ్మ ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ఆలయ చైర్మన్ నాయిని మల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భక్తులకు స్వయంగా వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్న దానం మిన్న అన్నారు. అందరూ ఇటువంటి సేవా కార్యక్రమాలు అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మహంతి గౌరీశంకర్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవాలయంలో..

దాబాగార్డెన్స్ : నగరంలోని 38వ వార్డు పరిధి లక్ష్మీ టాకీస్ సమీపాన గల మహాలక్ష్మి దేవాలయం వద్ద శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి జ్యోతి స్వరూప నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం దక్షిణ నియోజకవర్గ అధ్యక్షుడు పిల్ల నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్, హరిత దంపతులు పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గాయత్రిదేవి చారిటబుల్ ట్రస్ట్ 2008లో ప్రారంభించబడిందని, ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు పి. సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ ఆలేటి హేమలత, దేవుడు, శ్రీనివాస్, బాబూరావు, నాగేశ్వరరావు, అప్పలరాజు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న కొణతాల శ్రీనివాస్, హరిత దంపతులు

తిక్కవానిపాలెం తీరానికి చేరిన మృతదేహం

- వేటకు వెళ్లి గత నెల 25న గల్లంతు
- మృతుడి వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మారుపల్లి అప్పన్నగా గుర్తింపు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహం విశాఖ వన్‌టౌన్ ఏవీఎన్ కళాశాల ఏరియాకు చెందిన మారుపల్లి అప్పన్న(26)గా గుర్తించారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు.. విశాఖ వన్‌టౌన్ ఏరియాకు చెందిన మారుపల్లి అప్పన్న మరికొంత మందితో కలిసి గత నెల 21న తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ నుంచి బోటుపై చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. కాగా గత నెల 25న మారుపల్లి అప్పన్న ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయాడు. తోటి వేటగాళ్లు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో వెనుదిరిగారు. మెరైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో అప్పన్న మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం తిక్కవానిపాలెం తీరానికి కొట్టుకు వచ్చింది. సమాచారాన్ని పోలీసులు మృతుడి బంధువులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

మంగళకారిణి.. సౌభాగ్య ప్రదాయిని

- కనకమహాలక్ష్మికి భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం
- మార్మోగిన శ్రావణలక్ష్మి నామస్మరణ



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న ఉభయదాతలు



ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్: సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణ మార్మోగింది. శ్రావణ మాసపు పవిత్ర శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లల్లో అమ్మవారిని పూజించారు. బంగారు కాసులతో కొలిచారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మరోవైపు వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక కార్యక్రమాలతో నగరంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మూడో శుక్రవారం వ్రత పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించి, వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఉదయం 8 గంటలకు శ్రావణ లక్ష్మి పూజలు ప్రారంభించారు. పూజలో 255 మంది ఉభయదాతలు నేరుగా పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన పలువురి పేరిట అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. అమ్మవారిని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసంలో జరిగే పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2711725, 2568645 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో శిరీష తెలిపారు.

అమ్మవారికి క్షీరాభిషేక సేవ

అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు 0891-2566514, 8985515989 నంబరులో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు సభ్యులు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పూర్తి

- నియోజకవర్గంలో ఇంటింటికీ తిరిగిన బీఎల్‌వోలు
- అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయమై పని చేసిన నమోదు అధికారులు



ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తున్న సిబ్బంది

జగదాంబ : దక్షిణ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు కార్యక్రమం శత శాతం పూర్తయింది. కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పుల కోసం చేపట్టిన సర్వేని అధికారులు పూర్తి చేశారు. మొత్తం 235 పోలింగ్ కేంద్రాల్లో 2,17,140 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,07,964 మంది, స్త్రీలు 1,09,138 మంది, ట్రాన్స్‌జెండర్లు 38 మంది ఉన్నారు. సర్వే అనంతరం వివిధ కారణాల వలన ఓటర్లను తొలగించడానికి 3,261 దరఖాస్తులు అందాయి.

రాజకీయ పార్టీల సమన్వయంతో..

ఓటరు నమోదు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడంతో పాటు రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుంటు ముందుకు సాగడంతో సర్వే త్వరితగతిన పూర్తయింది. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఓటర్ల సర్వేను ఎన్నికల నమోదు అధికారులు, సహాయ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి మృతి చెందిన ఓటర్ల జాబితాలను రూపొందించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.

2,378 దోరు నంబర్లలో 35,357 మంది ఓటర్లు..

రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న దక్షిణ నియోజకవర్గంలో ఒకే డోర్ నంబర్‌పై పదికి పైగా ఓటర్లు చాలా చోట్ల ఉన్నారని, చాలా మంది డోర్ నంబర్ లేకుండా ఉంటున్నారని ఎన్నికల నమోదు అధికారులకు ఫిర్యాదులందడంతో సంబంధిత బీఎల్‌వోలు ఆ దిశగా కూడా సర్వే పూర్తి చేశారు. జీరో డోర్ నంబర్లు 25 వరకు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఇళ్లలో అద్దెకుండి.. ఆ తర్వాత ఖాళీ చేయడం, తమ ఓటును అక్కడికి మార్చుకోకపోవడం, అదే ఇంట్లోకి కొత్తవారు వచ్చి తమ ఓటు నమోదు చేసుకోవడం వంటి కారణాల రీత్యా ఇలాంటివి జరిగినట్లు గుర్తించారు. వాటిని త్వరలో చేపట్టనున్న రేషనలైజేషన్‌లో సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో ఓటర్ల సరళి ఇలా..

మొత్తం ఓటర్లు :	2,17,140
పురుషులు:	1,07,964
మహిళలు:	1,09,138
ట్రాన్స్‌జెండర్లు:	38
సర్వే శాతం :	96.46
మొత్తం బీఎల్‌వోలు :	235
జీరో దోర్ నంబర్లు :	25
వందేళ్లు దాటిన ఓటర్లు :	34
పది ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు ఉన్న దోర్ నంబర్లు:	2,378
వాటిలో ఓటర్లు:	35,357
కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారు :	6,846
తొలగించడానికి అందిన దరఖాస్తులు :	3,261
మార్పులు, చేర్పుల కోసం అందిన దరకాస్తులు :	4237

సర్వే పూర్తి చేశాం..

ఓటర్ల జాబితాలపై ఇంటింటి సర్వే పూర్తి చేశాం. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులతో ప్రతి మంగళవారం సమావేశం నిర్వహించి సర్వేలకు సంబంధించి పూర్తి వివరాలు అందజేశాం. మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అంతా సక్రమంగా ఉన్నదీ లేనిదీ సరి చూసుకోవాలని చెప్పాం.

– డి. హుసేన్‌సాహెబ్, ఓటర్ల నమోదు అధికారి

మహిళ మెడలో గొలుసు చోరీ

తాటిచెట్లపాలెం : రైల్లో ప్రయాణిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం రాత్రి విశాఖపట్నం రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాతపట్నంకు చెందిన నల్ల కృష్ణవేణి బంధువులతో కలిసి విశాఖపట్నంలో శీమంతం వేడుకలో పాల్గొనేందుకు గుణుపూర్ పాసింజర్ స్పెషల్‌లో వస్తున్నారు. రైలు కంచరపాలెం వద్దకు వచ్చేసరికి వీరు గేట్ దగ్గర వేచి ఉన్నారు. ఈ సమయంలో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో ఇదే రైలులో ప్రయాణిస్తున్న మాస్క్ ధరించి ఉన్న ఒక వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసు తెంచుకొనిపోయాడు. రైలు స్టేషన్‌కు చేరుకున్నాక బాధితులు గవర్నమెంట్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోయిన గొలుసు సుమారు 2 తులాలు ఉంటుందని తెలిపారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

బీహెచ్‌ఈఎల్ ఉద్యోగులకు అభినందన

అల్లిపురం : బీహెచ్‌ఈఎల్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్యానల్‌ను గెలిపించిన ఉద్యోగులకు ఏఐటీయూసీ విశాఖ జిల్లా సమితి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు, జీఎస్‌జే అచ్యుతరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం ఉద్యోగులు, కార్మికుల విజయంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఏఐటీయూసీ పట్ల అత్యంత విశ్వాసంతో గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నందుకు అభినందనలు తెలియపరుస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం : గత నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల సులభ్ కాంప్లెక్స్ పక్కన మద్యం తాగి ఒక వ్యక్తి పడి వున్నాడు. 30వ తేదీ ఉదయం వరకు అతను అలానే ఉన్నాడు. దీంతో స్థానికులు గుర్తించి విషయాన్ని టూటౌన్ పోలీసులకు తెలియజేయటంతో వారు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మరణించిన వ్యక్తి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, తెలుపు రంగు ఛాయలో, సిమెంట్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, నీలం రంగు ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. గుర్తించిన వారు 9492385472, 0891-2783672 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



భాస్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డు గొడారిగోతులు ప్రాంతానికి చెందిన పైలా భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారాల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు నాయకులు, భాస్కర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.